నమస్తే తెలంగాణ

వికారాబాద్

I | హైదరాబాద్, గురువారం 17 ఏప్రిల్ 2025 | VIKARABAD


## విద్యార్థులు కంటి పరీక్షలు చేయించుకోవాలి



వికారాబాద్, ఏప్రిల్ 16 : విద్యార్థులు ప్రతి ఏటా కంటి పరీక్షలు చేయించుకోవాలని వికారాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సంఘం లక్ష్మీ బాయి పాఠశాలలో పలువురు విద్యార్థులకు కంటి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కూల్ ఐ స్క్రీనింగ్‌లో భాగంగా బడి పిల్లలకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. వికారాబాద్ జిల్లాలో 69,201 విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు.



కొత్రేపల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

## దండులా వెళ్లి సక్సెస్ చేద్దాం

- బీఆర్‌ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆనంద్
- కొత్రేపల్లిలో స్థానిక యువకులు, మహిళలు, కార్యకర్తలకు పిలుపు

వికారాబాద్, ఏప్రిల్ 16 : వరంగల్‌లో ఈ నెల 27న జరుగనున్న బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభకు దండులా తరలివెళ్లి విజయవంతం చేద్దామని ఆ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్రేపల్లిలో స్థానిక యువకులు, మహిళలతో మాట్లాడి.. రజతోత్సవ మహాసభకు భారీగా వెళ్లి సక్సెస్ చేద్దామని సూచించారు. రానున్నది మన ప్రభుత్వమేనని.. సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ వికారాబాద్ పట్టణాధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు సుభాన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ మల్లికార్జున్, నాయకులు యాదగిరి, రాజు, రవి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

# కరెంట్ కోతలతో కష్టాలు

### వ్యవసాయంతోపాటు గృహాలకు రోజుకు 15-20 సార్లు పవర్ కట్

- ఏప్రిల్ మొదటి వారం నుంచి మరీ పెరిగిన కరెంట్ కోతలు
- ఎప్పుడొస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని స్థితిలో జనం అయోమయం
- కాంగ్రెస్ సర్కార్ తీరుపై మండిపడుతున్న ప్రజలు
- విద్యుత్తు కోతలతో పరిశ్రమలు పవర్ హాలీడేలు ప్రకటించే దుస్థితి నెలకొన్న వైనం
- రాత్రి సమయాల్లో ఎక్కువగా కట్ చేయడంతో ఉబ్బరాన్ని తట్టుకోలేక పోతున్న ప్రజలు
- ఓ వైపు భూగర్భ జలాలు అడుగంటుతుండడం, మరోవైపు కరెంట్ కోతలతో ఇబ్బందుల్లో రైతులు
- ప్రస్తుతం రోజుకు 7.2 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగం
- జిల్లాలో గత వారం రోజులుగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



కరెంట్ లేక మొబైల్ వెలుగులో వంట చేస్తున్న ఓ మహిళ

వికారాబాద్ జిల్లాలో కరెంట్ కోతలు పెరిగిపోయాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కరెంట్ కష్టాలు మొదలవుతాయని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పినట్లుగానే జరుగుతున్నది. ఎండల తీవ్రత పెరగడంతో అనధికారిక విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయి. ఓ సమయమంటూ లేకుండా కరెంట్ కట్ చేస్తున్నారు. డిమాండ్‌కు సరిపడా కరెంట్ లేకపోవడంతో త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా వేళల్లో కోతలు విధిస్తున్నారు. మరీ ముఖ్యంగా ఏప్రిల్ మొదటి వారం నుంచి కోతలు అధికమయ్యాయి. రోజుకు 15-20 సార్లు కరెంట్ కోతలు విధిస్తుండడం గమనార్హం. గృహాలకు విద్యుత్తు సరఫరాకు సంబంధించి మరీ దారుణంగా తయారైంది. ఓ వైపు ఎండల తీవ్రత పెరిగి గత వారం రోజులుగా జిల్లాలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుండడంతోపాటు కరెంట్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత పది, పదిహేను రోజులుగా రాత్రి వేళల్లో ఓ సమయమంటూ లేకుండా పదుల సార్లు కరెంట్ కట్ చేస్తున్నారు. అసలు కరెంట్ కోతలు లేవని ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం అనధికారికంగా కరెంట్ కోతలు విధిస్తున్నది. మరోవైపు జిల్లాలో వ్యవసాయంతోపాటు గృహ వినియోగం, పరిశ్రమలకు రోజుకు ప్రస్తుతం 7.2 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగమవుతున్నట్లు అధికారులు లెక్కలు చెప్తున్నారు. - వికారాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ)



కరెంట్ లేక బోరు నీళ్లు పోయక ఎండిపోయిన పంట

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి సబ్బండ వర్గాలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్తు సరఫరాలోనూ రైతులకు అన్యాయం చేస్తున్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు వ్యవసాయానికి 24 గంటల నిరంతర విద్యుత్తు సరఫరా చేస్తే.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే వ్యవసాయానికి కరెంట్ కోతలు మొదలయ్యాయి. ప్రస్తుతం వ్యవసాయానికి సంబంధించి అధికారికంగా నాలుగున్నర గంటలపాటు త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా కోతలు విధిస్తున్నారు. అనధికారికంగా ఓవర్ లోడ్ పేరిట ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నారు. ఓ వైపు బోర్లు, బావుల్లో అడుగంటిపోతున్న భూగర్భజలాలకు తోడు కరెంట్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యాసంగిలో సాగు చేస్తున్న వరి తదితర పంటలకు బోర్లు, బావుల్లో ఉన్న నీటిని కూడా అందించలేక జిల్లాలో పంటలు ఎండిపోయిన పరిస్థితులున్నాయి.

### గత కాంగ్రెస్ పాలనను గుర్తుకు తెచ్చుకుంటున్న అన్నదాతలు

ఈ నెలాఖరుతోపాటు మేలో ఎండల తీవ్రత అధికంగా ఉండనున్న దృష్ట్యా కరెంట్ ఎప్పుడొస్తదోనని ఎదురుచూడాల్సిన పరిస్థితులు రానున్నాయి. కరెంట్ కోతలతో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనను జిల్లా రైతాంగం గుర్తు చేసుకుంటున్నది. నాడు కాంగ్రెస్ హయాంలో అర్ధరాత్రి 2-3 గంటలపాటు కరెంట్‌తో పంటలకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతులు ఎంతో మంది విద్యుద్ఘాతాలతో మృత్యువాత పడడంతోపాటు చాలా మంది రైతులు పంట పొలాలకు నీరు పెట్టేందుకు మోటర్లు ఆన్ చేయబోయి మృతిచెందారు. కరెంట్ కష్టాలతో బోర్లు, బావుల్లో నీరున్నా సాగు చేసుకోలేని పరిస్థితి దయనీయ పరిస్థితి నెలకొని ఉండేది. మరోవైపు పరిశ్రమలకు సంబంధించి కూడా పవర్ కట్స్ పెరిగాయి.

### అప్పడలా.. ఇప్పడిలా..

గత ప్రభుత్వ హయాంలో నిరంతర విద్యుత్తు సరఫరాతో పరిశ్రమలను నెలకొల్పేందుకు క్యూ కడితే.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్తు కోతలతో పరిశ్రమలు పవర్ హాలీడేలు ప్రకటించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మరోవైపు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లావ్యాప్తంగా నిరంతర విద్యుత్తును సరఫరా చేసేందుకు రూ.303 కోట్లు ఖర్చు చేసి వ్యవసాయానికి 24 గంటలపాటు విజయవంతంగా విద్యుత్తును సరఫరా చేశారు. వ్యవసాయం అనుబంధ రంగాలకు 24 గంటలపాటు నిరంతర విద్యుత్తు సరఫరాకుగాను 11,617 కిలోమీటర్ల మేర 33కేవీ, 11కేవీ, ఎల్‌టీ సామర్థ్యంగల విద్యుత్తు లైన్ల వేయడంతోపాటు 13,145 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. రాష్ట్రం ఏర్పాటైన అనంతరం నిరంతర విద్యుత్ సరఫరాతో 3.31 లక్షల ఎకరాల్లో జిల్లాలో ఆయా పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. నిరంతర విద్యుత్తు సరఫరాకు ముందు 3.30 లక్షల ఎకరాలుగా ఉన్న ఆయా పంటల విస్తీర్ణం 2024 వరకు 6 లక్షల ఎకరాలకు పెరిగింది.



కరెంట్ లేక ఆరుబయట కూర్చున్న ప్రజలు





## అప్‌గ్రేడ్ అయినా..

- సరైన వైద్యం అందక రోగులకు అవస్థలు
- సరిపడా సిబ్బంది లేక తగ్గుతున్న సాధారణ డెలివరీలు
- రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు రంగారెడ్డి జిల్లాలోని ఐదు దవాఖానలను అప్‌గ్రేడ్ చేసిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం
- సరిపడా వైద్యులు, సిబ్బందిని సమకూర్చేలోపే ఎన్నికల కోడ్
- ఆపై.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆ ఐదు ఆస్పత్రులపై శ్రద్ధ చూపని వైనం
- గైనకాలజిస్టులు లేక కాన్పులు చేస్తున్న స్టాఫ్ నర్సులు
- ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్న జిల్లావాసులు

రంగారెడ్డి, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో అప్‌గ్రేడ్ అయిన దవాఖానల్లోనూ సరైన వసతులు అందక రోగులు ఆపసోపాలు పడుతున్నారు. ఏరియాలు పెరుగుతుండడంతో ఆయా ఆస్పత్రులను పది పడకల నుంచి యాభై పడకలకు పెంచి పేదలకు మెరుగైన వైద్యంతోపాటు కాన్పులు, కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేయాల్సి ఉంటుంది. కాగా, జిల్లాలో ఐదు ఆస్పత్రులు అప్‌గ్రేడ్ కాగా.. అందులో సరిపడా డాక్టర్లు, వైద్య పరికరాలు, సిబ్బంది మాత్రం ఇప్పటికీ సమకూర్చలేదు. గత కేసీఆర్ ప్రభుత్వం ఐదు దవాఖానలను అప్‌గ్రేడ్ చేసి సిబ్బందిని, వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకునేలోపే.. అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా.. అప్‌గ్రేడ్ అయిన ఆస్పత్రులపై ఎలాంటి శ్రద్ధ చూపకపోవడంతో సామాన్యులతోపాటు డెలివరీలకు వెళ్తున్న మహిళలకు డాక్టర్లు లేక స్టాఫ్ నర్సులే సాధారణ కాన్పులు చేస్తున్నారు. అలాగే, గతంలో డీపీఎల్ క్యాంపుల ద్వారా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసే వారు. కొంతకాలంగా ఆ క్యాంపులను నిర్వహించకపోవడంతో పేదలు ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయించాల్సి దుస్థితి నెలకొన్నది.

### జిల్లాలో అప్‌గ్రేడ్ అయిన ఆస్పత్రులు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లాలోని ఆమనగల్లు, హయత్‌నగర్, శంషాబాద్, ఇబ్రహీంపట్నం, యాచారం ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేసింది. ఈ ప్రాంతాలు రోజురోజుకూ విస్తరిస్తున్నాయి. పెరుగుతున్న రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు వాటి బెడ్ల సామర్థ్యాన్ని కూడా పెంచింది. గైనకాలజిస్టు, మత్తు, జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, రేడియాలజిస్టు, చెవి, ముక్కు, కంటి వంటి వ్యాధులకు సంబంధించిన వైద్యులు, ఇతర సిబ్బందిని నియమించాల్సి ఉండగా.. అప్పుడే అసెంబ్లీ ఎన్నికలొచ్చి.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా.. ఇప్పటివరకు ఏ ఒక్క డాక్టర్, సిబ్బందిని కూడా నియమించలేదు. ఈ ఆస్పత్రులపైనా ఆజమాయిషీ కూడా కరువైంది. గతంలో ఈ దవాఖానలు డీఎంహెచ్‌వో ఆధీనంలో ఉండగా.. వైద్యసేవలు బాగా అందడం.. ఔట్ పేషెంట్లతోపాటు కాన్పులు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు బాగా జరగడంతో వాటిని వైద్యవిధాన పరిషత్‌లోకి మార్చారు. అక్కడికెళ్లిన తర్వాత ఈ ఆస్పత్రులపై పర్యవేక్షణ కొరవడింది. ఇటీవల వైద్యారోగ్యశాఖ మంత్రి ఇబ్రహీంపట్నం ఆస్పత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్యసేవలు, ఆస్పత్రికి కావల్సిన వసతులను పరిశీలించాల్సి ఉండగా.. ఈ కార్యక్రమం అనుకోని కారణాలతో వాయిదా పడింది. ప్రభుత్వం స్పందించి ఐదు దవాఖానల్లో సరిపడా సిబ్బందిని భర్తీ చేసి, వసతులు కల్పించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

### గైనకాలజిస్టులు లేక.. తగ్గిన కాన్పులు

గత బీఆర్‌ఎస్ హయాంలో అమ్మఒడి పథకం కింద గర్భిణులకు పౌష్టికాహారం, బాలింతలకు కేసీఆర్ కిట్లు పంపిణీ చేశారు. అలాగే, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులను పెంచేందుకు స్త్రీల వైద్య నిపుణులు అందుబాటులో ఉండేవారు. సాధారణ డెలివరీలతోపాటు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు కూడా పెద్దఎత్తున జరిగేవి. అలాగే, డీపీఎల్ క్యాంపుల ద్వారా కూడా ఆపరేషన్లు చేసేవారు. కాగా, ఐదు దవాఖానలు డీఎంహెచ్‌వో పరిధి నుంచి వైద్యవిధాన పరిషత్‌లో చేరిన తర్వాత సరిపడా వైద్యులు, సిబ్బంది లేక సాధారణ కాన్పులు నెలకు పది కూడా దాటడం లేదు. అలాగే, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పూర్తిగా నిలిచిపోయాయి. ఎవరైనా కు.ని ఆపరేషన్లు చేయించుకోవాలంటే ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొన్నది.

### గైనకాలజిస్టులు లేరు



ఇబ్రహీంపట్నం, యాచారం ప్రభుత్వ ఆస్పత్రుల్లో గైనకాలజిస్టులు లేకపోవడంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయలేకపోతున్నాం. కేవలం సాధారణ కాన్పులే చేస్తున్నాం. ఈ నెలలో ఇప్పటివరకు నాలుగు డెలివరీలు మాత్రమే జరిగాయి. స్త్రీల వైద్య నిపుణులుంటే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లూ చేసేవాళ్లం.

- ప్రియాంక, యాచారం వైద్యురాలు

### అప్‌గ్రేడ్ పేరుతో కాలయాపన



గత కేసీఆర్ ప్రభుత్వం ఐదు ప్రభుత్వ ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేసి వైద్యవిధాన పరిషత్‌లోకి చేర్చింది. కాగా, ఆ దవాఖానలను కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవడం లేదు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లతోపాటు కాన్పుల కోసం ఆస్పత్రులకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి వైద్యులు లేక స్టాఫ్ నర్సులే కాన్పులు చేస్తుండడంతో తల్లీబిడ్డల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నది. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆస్పత్రుల్లో సరైన వైద్యసిబ్బంది, పరికరాలను సమకూర్చాలి.

- చెరుకూరి మంగ, మాజీ ఎంపీటీసీ



## నీరు లేక నెర్రెలు వారిన వరి పొలం

పరిగి, ఏప్రిల్ 16 : పరిగి మండలం చిగురాల్‌పల్లి గ్రామానికి చెందిన మోముల ఆంజనేయులు సుమారు ఎకరంన్నరకు కొంత తక్కువ గల భూమిలో ఈసారి వరి పంట సాగు చేశాడు. దున్నడం, కరిగెట, విత్తనాలు, ఎరువులు, నాట్లు వేసేందుకు సుమారు రూ.25వేలు ఖర్చయ్యాయి. ఎప్పటిలాగే వరి బాగా పండుతుందని ఆశించాడు. కానీ క్రమేణా బోరులో నీరు తగ్గిపోవడంతో పంటకు నీరు సరిపోని పరిస్థితి నెలకొన్నది. అరకొరగా నీటితో పంట ఎదుగుదలే నిలిచిపోయింది. చుట్టుపక్కల గల పంటలు పచ్చగా ఉండగా.. ఆంజనేయులు పొలంలో వరి పంటకు నీరు సరిపోక ఇప్పటికే నేల నెర్రెలు వారింది. దీంతో తాను ఇన్నాళ్లుగా పడిన కష్టం వృథా అవుతున్నదని రైతు వాపోతున్నాడు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి, సొంత కష్టం చేసి పంట సాగు చేస్తే ఒక్కసారిగా నీరు తగ్గిపోయి ఈ పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశాడు. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని, ఈసారి నీరు లేక పంట ఎండిపోయి ఇబ్బందులు పడుతున్నట్లు రైతు పేర్కొన్నాడు.

## నిధులు రాక.. నిర్వహణ లేక..

- బోట్యానాయక్‌తండా వైకుంఠధామంలో ఎండిపోయిన చెట్లకు నిప్పు పెట్టిన గ్రామపంచాయతీ సిబ్బంది
- పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఏర్పాటు చేసిన హరితహారానికి తూట్లు పొడుస్తున్న పాలకులు, అధికారులు
- నిధులు విడుదల చేసి పర్యావరణాన్ని కాపాడాలని కోరుతున్న ప్రజలు



వైకుంఠధామంలో ఎండిపోయిన మొక్కలు, చెట్లకు నిప్పు పెట్టిన పంచాయతీ సిబ్బంది

కులకచర్ల, ఏప్రిల్ 16 : గ్రామాల్లో పల్లె ప్రకృతివనాలు, వైకుంఠధామాల్లో పెట్టిన మొక్కలు ఎండిపోతుండటంతో వాటి జాడ తెలియకుండా ఉండేందుకు గ్రామపంచాయతీల సిబ్బంది వాటికి నిప్పుపెడుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలో ప్రకృతివనాలు, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలను ఏర్పాటు చేసింది. అప్పట్లో వీటి నిర్వహణ ఉద్యమంగా చేశారు. ప్రతి చెట్టుకు నీటిని అందించడంతోపాటు వాటి నిర్వహణ చాలా బాగుండేది. కాని నేటి ప్రభుత్వం వాటిపై దృష్టి సారించకపోవడంతో మొక్కలు, చెట్లు ఎండిపోతున్నాయి. రెండు రోజులకోసారి నీటిని అందించాల్సి ఉండగా.. సర్కారు నిర్వహణ నిధులు విడుదల చేయకపోవడంతో మొక్కలకు నీటిని అందించలేకపోతున్నామని గ్రామపంచాయతీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు. గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా ఉన్న అధికారులు కూడా ఈ విషయాన్ని పట్టించుకోవడంలేదని తెలుపుతున్నారు.

కులకచర్ల మండల పరిధిలోని బోట్యానాయక్‌తండా గ్రామ పంచాయతీ పరిధిలోని వైకుంఠధామంలో ఏర్పాటు చేసిన మొక్కలకు నీరు అందించక ఎండిపోవడంతో వాటికి గ్రామ పంచాయతీ సిబ్బంది నిప్పుపెట్టారు. దీనికి కారణం తమకు నిధులు రాకపోవడమేనని సిబ్బంది తెలియజేస్తున్నారు. దీనిపై పంచాయతీ అధికారులు కూడా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి హరితహారం ద్వారా పల్లె ప్రకృతివనాలు, వైకుతధామాలు, గ్రామ పంచాయతీల్లో నాటిన మొక్కలకు నీటిని అందించి వాటిని సంరక్షించాలని కోరుతున్నారు.

## ప్రభుత్వ భూమి కాజేసేందుకు కుట్ర

**గతంలోనే ఆ భూమిని కాజేయడానికి స్కెచ్ వేసి ఏకంగా వెంచర్ చేశారు. ప్లాట్లుగా చేసి కొంతమందికి విక్రయించారు. గతంలో ఉన్న తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి.. అది ప్రభుత్వ భూమిగా గుర్తించి ప్లాట్లుగా చేసిన వాటిని తొలగించి.. సూచిక బోర్డులు ఏర్పాటు చేయించారు. కొంతకాలంగా స్తబ్ధుగా ఉన్న భూ ఆక్రమణదారులు మరోసారి కబ్జా చేయడానికి ప్రయత్నించారు.**



అక్రమ నిర్మాణాలను జేసీబీతో తొలగిస్తున్న సిబ్బంది

బడంగ్‌పేట, ఏప్రిల్ 16 : రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం కుర్మల్‌గూడ సర్వే నం. 80లో ఉన్న ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా కబ్జా చేశారు. చుట్టూ ప్రహరీ నిర్మించారు. రాత్రికి రాత్రి పెద్దపెద్ద షెడ్లు వెలిశాయి. గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వ భూమిని కాజేసేందుకు బిగ్ స్కెచ్ వేశారు. గతంలోనే ఆ భూమిని కాజేయడానికి ఏకంగా వెంచర్ చేశారు. ప్లాట్లుగా చేసి కొంతమందికి విక్రయించారు. గతంలో ఉన్న తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి.. అది ప్రభుత్వ భూమిగా గుర్తించి ప్లాట్లుగా చేసిన వాటిని తొలగించి.. సూచిక బోర్డులు ఏర్పాటు చేయించారు. కొంతకాలంగా స్తబ్ధుగా ఉన్న భూ ఆక్రమణదారులు మరోసారి కబ్జా చేయడానికి ప్లాన్ వేశారు. ఈ క్రమంలో ఏకంగా షెడ్లు వెలిశాయి. స్థానికులు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో తహసీల్దార్ ఇందిరాదేవి ఆదేశాల మేరకు అధికారులు అక్రమ నిర్మాణాలన్నింటినీ జేసీబీతో తొలగించారు. కాగా, బాలాపూర్ మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను ఎవరు కబ్జా చేసినా.. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఇందిరాదేవి చెప్పారు. ప్రభుత్వ భూముల్లో రాత్రికిరాత్రే నిర్మాణాలు వెలుస్తున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కుర్మల్‌గూడ సర్వేనం.80లో ఉన్న భూమి అంతా ప్రభుత్వానిదేనని ఆమె స్పష్టం చేశారు.

## పేదల ఇంటి స్థలాల సమస్యను పరిష్కరించాలి

### రాచకొండ సీపీకి వినతిపత్రాన్ని అందించిన సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య



రాచకొండ సీపీ సుధీర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేసిన యాదయ్య తదితరులు

ఆదిబట్ల, ఏప్రిల్ 16 : రామోజీ ఫిల్మ్‌సిటీలోని పేదల ఇంటి స్థలాల సమస్యను త్వరగా పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య తదితరులు బుధవారం రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీపీ సుధీర్‌బాబు మాట్లాడుతూ.. ఇంటి స్థలాల అంశంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని.. త్వరలోనే ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. వినతిపత్రం అందించిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సామ్యూల్, మండల కార్యదర్శి బుగ్గరాములు, ఇంటి స్థలాల పోరాట కమిటీ కన్వీనర్ జగన్, మండల కమిటీ సభ్యుడు ఆనంద్, మాజీ ఎంపీటీసీ భిక్షపతి ఉన్నారు.